సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పెదబయలు: పాడేరులో జరిగే సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు బోండా సన్నినాబు కోరారు. ఈ మేరకు గోడ పత్రికలు ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.సరబన్న, కమిటీ సభ్యులు సీహెచ్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అటవీ వనరులను

కార్పొరేట్లకు అప్పగిస్తే ఊరుకోం

- రాజకీయ లబ్ధికోసం మోడీ దోస్తులకు హైడ్రో పవర్ ప్రాజెక్టు
- ఐక్య పోరాటం మరింత ఉధృతం
- సంప్రదాయ ఆయుధాలతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-పాడేరు: ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును మోడీ ఆదేశాలతోనే కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడంపై బాక్సైట్ తరహా పోరాటం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంఘం జాతీయ నాయకులు పి.అప్పలనర్స హెచ్చరించారు. చింతపల్లి మండలం ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు శ్రీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్, అదానీకి పెదకోట గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం ఎర్రవరం గ్రామంలో బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ నాయకులు పి.అప్పలనరస మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో అటవీ వనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, గిరిజన ప్రాంతాల పట్ల జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఖరిలో మార్పు వచ్చిందని అన్నారు. తన వ్యక్తిగత రాజకీయా అవసరాల కోసం ప్రధాని మోడీ మిత్రులైన అదానీ, శ్రీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు హైడ్రో పవర్ ప్రాజెక్టును అప్పగించాలని క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 1/70 చట్టానికి, సుప్రీం కోర్టు తీర్పుకి విరుద్ధంగా ఉందన్నారు. గిరిజన పోరాటానికి తలొగ్గి బాక్సైట్ తవ్వకాల జీవో నెంబర్ 97ను రద్దు చేశారని, గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరిలో మార్పు వచ్చిందని, అందుకే కేంద్ర అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణకు కేంద్రం ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాలలో సవరణ బిల్లు ప్రవేశ పెట్టాలని అఖిల పక్ష సమావేశం లో కేంద్ర ప్రభుత్వం ఎజెండా పెట్టిందని తెలిపారు. చట్ట సవరణలు అనంతరం అటవీ ప్రాంతంలో మైనింగ్, పవర్ ప్రాజెక్టు లను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రక్రియ సులవతరం కానుందన్నారు. గిరిజన గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి (టిఏసి) తీర్మానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అప్పగించడం సరైంది కాదన్నారు. పీసా, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టాలను గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్నా లెక్క చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సవత్సరాలుగా గ్రామంలో సర్వే నిర్వహించిందని, గత ఏడాది డిసెంబర్ 23న అటవీ, పర్యావరణ అనుమతులను మోడీ ప్రభుత్వం మంజూరు చేసిందని, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తే గిరిజన గ్రామ ప్రజలు నిర్వాసితులు అవుతారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పసంహరించుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు 100శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జీవో 3 పునరుద్ధరణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాబినెట్లో ఏనాడూ చర్చ పెట్టకుండా గిరిజన ప్రాంతాన్ని సర్వనాశనం చేయలనుకోడం అన్యాయమన్నారు. విద్యా సంస్థలలో విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాలు ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ సంపద దోపిడీ పై గిరిజన ప్రజా ప్రతినిధులు స్పందించాలని పిలుపునిచ్చారు.

ముందుగా ఏర్రవరం గ్రామంలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ ఆయుధాలు ప్రదర్శించి మోడీ, జగన్‌ను హెచ్చరిస్తూ నిరసన ప్రదర్శనలు జరిపారు. సంప్రదాయ ఆయుదలైన విల్లంబులు, ఈటెలు, కత్తులు, గోడ్డలతో దిష్టి బొమ్మ పై దాడి చేసి దగ్గం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సింహాచలం, గ్రామ ఉప సర్పంచ్ సోమరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ బెన్నా స్వామి, వేణుగోపాల్, రాజు, రాజుబాబు, మంగ రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సాంప్రదాయ ఆయుధాలతో నిరసన చేపడుతున్న అప్పలనర్స, చిన్నయ్యపడాల్, గిరిజనులు

పిహెచ్‌సి భవనం ప్రారంభం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి (పిహెచ్‌సి) నూతన భవనాన్ని విశాఖ ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ట్రైకాకర్ డైరెక్టర్ శతకం బుల్లిబాబు ప్రారంభించారు. అనంతరం స్థానిక సర్పంచ్ శివశంకర్ మాట్లాడుతూ మాట్లాడుతు, పీహెచ్సీ భవనాన్ని నూతనంగా నిర్మించడం ఆనందదాయకంగా ఉందన్నారు.భవనం నిర్మాణం చేపట్టడంతో రోగులకు సంపూర్ణ వైద్య చికిత్సలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు. బంగరుమెట్ట, దారేల, వనభసింగి, పెడగుడ, ఏనుగురాయి, జర్రెల, పరెడ గ్రామ పంచాయతీల ప్రజలు వైద్య సేవలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఆసుపత్రి నిర్మాణంకు భూమి దానం చేసిన కుటుంబానికి సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూదానం చేసిన కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో కిరణ్ కుమార్, ఎస్సై రవీంద్ర, కిలగడ పీహెచ్ వైద్యాధికారి రమేష్, వైస్ సర్పంచ్ వి జగన్నాదం, వార్డు సభ్యులు బొంజుబాబు, పరంజ్యోతి, శ్రీను, వైసీపీ మండల నాయకులు, గ్రామ వాలంటరీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే ఫాల్గుణ

జి.మాడుగుల గురుకుల పాఠశాలలో..

ముగ్గురు విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు
- కెజిహెచ్‌కు తరలింపు

ప్రజాశక్తి-పాడేరు: జి.మాడుగుల మండలం గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాటలో జర్త కొండబాబు అనే విద్యార్థి గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు కల్పించి ఉన్నత వైద్య సేవల నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు బుధవారం సాయంత్రం తరలిస్తున్నారు. గాయపడిన ఈ విద్యార్థికి వైద్యం కల్పన కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి సహకారం అందించిన గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ, తెలిపిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జర్త కొండబాబు తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి. ఈనెల 6న సాయంత్రం 4:30 గంటల సమయంలో అంబలి తాగుతున్నాడు. అదే సమయంలో 9వ తరగతి చదువుతున్న సాయి శరత్ వాలీబాల్ ఆడుతూ తన్నడంతో జర్త కొండబాబు ముఖం పైన వాలీబాల్ బాలు తగిలింది. జర్త కొండబాబు, సాయి శరత్ ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి సాయి శరత్ ఫ్రెండ్ ఎం.దిలీప్‌తో కలిసి వెళ్లి బెడ్ మీద పడుకొని ఉన్న జర్త కొండబాబు గుండెలపై ఎక్కి దూకడంతో, తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. 7వ, తేదీ ఉదయం క్లాస్ టీచర్, హెల్త్ అసిస్టెంట్ జి.మాడుగుల ఆసుపత్రిలో చికిత్స చేశారు.కొండబాబు పరిస్థితి విషమంగా ఉందని స్వగృహానికి స్కూల్ యాజమాన్యం సమచారం పంపింది. ఇంటికి వెళ్లిన కొండబాబు అస్వస్థత ఉండడంతో తల్లిదండ్రులు అడగ్గా జరిగిన వివరాలు కొండబాబు చెప్పాడు. కొండబాబు పరిస్థితి విషమంగా ఉండడంతో , పాడేరు జిల్లా ఆసుపత్రికి చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ విద్యార్థి శ్వాస అందకపోవటంతో రిఫర్ చేస్తున్నట్టు వైద్యులు తెలిపారు విద్యార్థిపై దాడి చేసిన విద్యార్థులపై నిర్లక్ష్యంగా వహించిన పాఠశాల యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాఖ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బల్లుగుడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట పిహెచ్‌సి పరిధిలో కొత్త బల్లుగూడ గ్రామ సచివాలయంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్సి వైద్యాధికారిని కిరణ్మయ వివిధ వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులు, వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గోరు వెచ్చని నీరు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సందర్శించి విద్యార్థినిలకు వివిధ టెస్టులు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది రాధమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏఎన్ఎం తులసి, లీలావతి 104 సిబ్బంది కిషోర్, అప్పలరాజు ,ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.155 కోట్లతో తాగునీటి కుళాయిలు

- -మొబైల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు
- -కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.155 కోట్లతో మారుమూల గ్రామాల్లో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ పనులు 1200 వర్కులు మంజూరయ్యాయని, వీటిని ఆరు నుంచి 8 నెలలోపు 70 శాతం పనులు పూర్తి చేస్తే మారుమూల ప్రాంతాల్లో మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో డిజిటల్ మొబైల్ కనెక్టివిటీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలోనే జిల్లాలో 1200 నుంచి 1500 వరకు మొబైల్ టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందులో 150 టవర్లు ఇన్సులేషన్ పేజీలో ఉన్నాయని, ప్రతి నెలకు 50 టవర్లు చొప్పున సిగ్నల్స్ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మారుమూల ప్రాంతాలైన దారకొండ, గాలికొండ, రాంగూడ, బలపం, అనంతగిరి తదితర ప్రాంతాల్లో 1000 మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 46 పిహెచ్‌లు ఉన్నాయని, ప్రతి పిహెచ్‌సికి ఇద్దరు వైద్యాధికారులు ఉంటే వైద్య సేవలు మరింత మెరుగ్గా అందుతాయని తెలిపారు. జిల్లాలో 40 నుంచి 45 మంది వైద్యులను నియమిస్తామని చెప్పారు. 150 నుంచి 400 వరకు అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. గంజాయి సాగును వదులుకున్న వారికి కాఫీ, మిరియాలు, వరి, కూరగాయలు పండించుకోవటానికి ప్రభుత్వ పరంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు అనువైన సిల్వర్ ఓక్ నర్సరీలను చింతపల్లిలో ఏర్పాటు చేశామన్నారు. జీడిమామిడి మొక్కలను కూడా సీజన్లో సరఫరా చేసి ఆదుకోవడం జరుగుతుందన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్

జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ మాదిగమల్లు గ్రామంలో జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు చింతపల్లి ఏఎస్పీ శివ కిషోర్, రంపచోడవరం ఎఎస్‌పి రానా, జీకే వీధి సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సంజీవని మెగా వైద్య శిబిరం, మెగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్, అమృత హృదయ ట్రస్ట్ కోన ప్రకాష్, డాక్టర్ చలపతి, దుష్ట ఐ హాస్పిటల్, దారకొండ మెడికల్ ఆఫీసర్స్ హిమబిందు నాగభూషణం ఆధ్వర్యంలో 1200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 80 మందికి అత్యవసర వైద్యశాల నిమిత్తం రిఫర్ చేశారు. వాలీబాల్ పోటీల్లో మండలంలోని గిరిజన గ్రామాల నుంచి 82 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు చొప్పున అందజేయనున్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు ఉచితంగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తారు. ముందుగా క్రీడాకారులని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులు, 2000 మంది ప్రజలకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ డిఎస్పి వెంకట్రావు, ఎస్సైలు అప్పల రాము, రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం పూర్తి చేయరూ...

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని మారుమూల పెద్ద మంటపల్లి నుండి కుందులూరు రోడ్డు నిర్మాణ పనులు రెండేళ్లు గడిచినా పూర్తి చేయలేదు. రహదారి తవ్వి వదిలేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పెద్దమటపల్లి నుండి కుందులూరు వరకు ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలైంది. ఇందులో భాగంగా నాడు తవ్వేసి వదిలేయడంతో రాళ్లు తేలిపోయి ఉన్నాయి. రెండేళు గడిచినా దాని నిర్మాణం చేపట్టలేదు. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పనులు, వైద్య సేవలు కోసం వెళ్ళాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల గిరిజన గ్రామాల దుస్థితి మాత్రం మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వి వదిలేయడంతో రాళ్లు తేలిపోయి ఉన్న దృశ్యం

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య

పోలవరంపై బిజెపి నిజస్వరూపం బట్టబయలైంది

- సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిజ స్వరూపం బట్టబయలైందని సిపిఎం కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. కూనవరం సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ఇప్పట్లో పూర్తి కాదని కేంద్ర మంత్రి మాట్లాడేతే రాష్ట్రంలో వైసిపి ఎంపీలుగాని, ముఖ్యమంత్రి, జగన్ గాని నోరు మెదక పోవడం దుర్మార్గమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కూడా ఇవ్వడం కుదరదని కేంద్రం పార్లమెంట్‌లో నిస్సిగ్గుగా ప్రకటించినా వైసిపి, టిడిపి ఎంపీలు ఏ ఒక్కరూ మాట్లాడకపోవడం రాష్ట్రం పట్ల ఆ పార్టీల వైఖరిని నిదర్శనమని పేర్కొన్నారు. ఆ రెండు పార్టీలు రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వసితులకు న్యాయం చేసే వరకు సిపిఎం పోరాడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాయం సత్యనారాయణ, తాళం శ్రీనివాసరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్, ఎంపిటిసి తదితరులు

పాఠశాలలో నాడు-నేడు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి బూర్గువాడ గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న పనులకు స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిధుల్లో రూ.4లక్షలతో వంట షెడ్ నిర్మాణం, మిగిలిన నిధులతో మరమ్మతు పనులు చేపట్టన్నట్లు తెలిపారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శిథిలావస్థలో ఉన్న బాత్ రూమ్‌లను, పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జల్లి ఉదయ్, వెల్ఫేర్ అసిస్టెంట్ సొడే నాగేశ్వరావు, స్కూల్ విద్య కమిటీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను ప్రారంభిస్తున్న ఎంపిటిసి సభ్యులు వంశి

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - రంపచోడవరం

రీ సర్వేతో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం అన్నారు. మండలంలోని తామరపల్లి పంచాయతీ ఎం.మూరుగుబందం గ్రామంలో రీ సర్వేను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కలిగి ఉన్న రైతుల పేరు మీద ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్క రైతు దగ్గరుండి భూములకు రీసర్వే చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, డెత్/ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సెల్ నెంబర్ సర్వేయర్‌కు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చోడి వెంకన్న దొర, విఆర్ఓ సత్యనారాయణ, సర్వేయర్లు విజయ, ప్రసన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ ఎపిగా మార్చిన వైసిపి ప్రభుత్వం'

ప్రజాశక్తి- విఆర్.పురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రాష్ట్రంలో మార్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొర్రా నరేష్ కుమార్ విమర్శించారు. మండలంలోని రేకపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎపిని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దారని, యువతకు ఉపాధి భరోసా కల్పించారని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. అలాంటి రాష్ట్రాన్ని డ్రగ్స్ రాష్ట్రంగా మార్చివేశారన్నారు. యువతను డ్రగ్స్‌కు బానిసలు చేశారని ఆరోపించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలను అదుపు చేయటంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షులు నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి బుర్కా కన్నారావు, సవలం రాజేంద్రప్రసాద్, ముత్యాల చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు

మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నరేష్ కుమార్

అంగన్‌వాడీ కేంద్రానికి చాపలు పంపిణీచేస్తున్న తహశీల్దార్

అంగన్‌వాడీ కేంద్రానికి చాపల పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండలంలోని చొంపి అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల, చిన్నారులు, బాలింతలు కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారని గమనించిన మండల తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం చాపలు (మెట్లను) సొంత నిధులతో పంపిణీ చేశారు. గ్రామస్తులు, అంగన్వాడీ సిబ్బంది తహశీల్దార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొంపి విఆర్ఓ కొటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను బాధితునికి అందిస్తున్న ఎస్ఐ

సెల్‌ఫోన్ అందజేత

ప్రజాశక్తి - పెదబయలు :మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి తన సెల్ ఫోన్ పోయిందని స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. తక్షణమే స్పందించిన ఎస్ ఐ పోగొట్టుకున్న ఫోన్ రెండు గంటల్లో ట్రాప్ చేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఎస్ఐ పులి మనోజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు

ఏలేరు కాలువ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో ఏలేరు కాలువ భూముల ఆక్రమణ చేస్తే కేసులు పెడతామని ఏలేర్ శాఖ డీఈ వసంత తెలిపారు. బుధవారం దుంగల వానిపాలెం గ్రామంలో ఏలేరు కాలువ భూమి ఆక్రమణపై ఫిర్యాదులపై ఆమె విచారణ చేపట్టారు. అనంతరం రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏలేరు కాలువ భూమి ఆక్రమణ గురైంది లేనిది సర్వే చేసి తేల్చనున్నామన్నారు. అప్పటి వరకు భూమి చదును పనులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుంగల వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యన్న పర్యటన

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఈనెల 15వ తేది నుంచి నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రుత్తల యర్రాపాత్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం లచ్చన్న పాలెం గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి
గుమ్మిరేవులులో గ్రామ సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు:గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తో ఆంధ్రప్రదేశ్‌లో సుపరిపాలన అందించేందుకు సాధ్యమైందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకే వీధి మండలం గుమ్మిరేవులు గ్రామ సచివాలయం, ఆర్బికే కేంద్రాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, పారదర్శకమైన పాలన అందించేందుకు జగన్మోహన్ రెడ్డి ఓ వినూత్న విధానాన్ని తీసుకొచ్చారని అదే గ్రామ సచివాల వ్యవస్థని చెప్పారు. గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్య పాలన దిశగా జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తీసుకునే విప్లవాత్మకమైన నిర్ణయాలకు దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతుందని తెలిపారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా అధికారులు, రాజకీయ నాయకులకు ప్రమేయం లేకుండా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తుండడం ఎన్నడూ చూడలేదని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఉపయోగించుకుని గ్రామాలన్నీ అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పిటిసి కిముడు శివరత్నం, గుమ్మిరేవులు సర్పంచ్ కమలమ్మ, ఎంపీటీసీ నాదెల గాన దీపిక, వైస్ ఎంపీపీలు దేవుడు, ఆనంద్ సీలేరు వైఎస్ఆర్సిపి నాయకులు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ సిహెచ్ ఆనంద్ , గూడెం ఎంపిటిసి పి.నాగమణి, ధారకొండ ఎంపీటీసీ రామన్న, గిరి, ధారకొండ సర్పంచ్ ఎం.రాజు, దామానపల్లి సర్పంచు కె.రామకృష్ణ, పెదవలస సర్పంచు వంశీ, నాయకులు బి.లక్ష్మణ్ , ఎ.అంజి, పి. బుజ్జి, ఎన్.వెంకట్రావు, పి.సుమలత, డి.గణేష్, కె.బలరాం, పి.సత్యనారాయణ, నూకరాజు చింతపల్లి ఎంపీపీ అనూష దేవి. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పుష్పలత, ఎంపీటీసీ కుమారి, పద్మ మండల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం, ఆర్‌బికెల ప్రారంభంలో ఎమ్మెల్యే, కలెక్టర్

ఇష్టానుసారంగా కన్వీనర్ల నియామకం తగదు

వైసిపి నేతల ఆవేదన

మాట్లాడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని అరకు నియోజకవర్గ పరిధిలో కొంతమంది వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, వైసిపి బలోపేతం చేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ కో కన్వీనర్లను నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కన్వీనరులను నియమించే విషయంలో అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే చెట్టి.పాల్గుణ ఇష్టానుసారంగా వ్యవహరించడం బాధాకరం అన్నారు. మండలంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో చర్చించి కన్వీనరులను గుర్తించి నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి విరుద్ధంగా ఆయన మాటే వేదంగా ఎవరిని సంప్రదించ కుండా ఆయన నచ్చిన వారికే కన్వీనరులను నియమించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కా లేదని అంటూ ఆ పార్టీ సీనియర్ నాయకులు వాపోయారు.పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నా వారిని దూరం చేసిన చులకన భావంతో చూస్తే అది పార్టీ మనుగడకే ముప్పు అనేది ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గుర్తించాలని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, సర్పంచులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగరలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-దుంబ్రిగుడ
మండలంలోని సాగర పంచాయతీ కేంద్రంలో బుధవారం స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కే సుబ్బారావు, మాజీ ఎంపీపీ కే.దన్నేరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర పంచాయతీలో మాట్లాడుతున్న టిడిపి నేతలు

అన్‌రాక్ నిర్వాసితులకు స్థలాలివ్వాలి

- మండల సమావేశంలో టిడిపి సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి- మాకవరపాలెం: అన్‌రాక్ భూ నిర్వాసితులకు రెండు సెంట్లు స్థలాలు ఎప్పుడు పంపిణీ చేస్తారో చెప్పాలంటూ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు, రాచపల్లి ఎంపీటీసీ ఆర్‌వై పాత్రుడుతో పాటు బూరుగు పాలెం ఎంపీటీసీ రుత్తల యర్ర పాత్రుడు తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీపీ సత్యనారాయణలను ప్రశ్నించారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిరసించారు. ముందుగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ, జనవరి 4 నుంచి ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. 12,900 ఎకరాల్లో ఈ క్రాప్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎంఈఓ గణేష్ మాట్లాడుతూ, పిఎమ్‌జీసి పథకం కింద మండలంలో 18 పాఠశాలలు ఎంపిక అయినట్లు తెలిపారు. తహసిల్దార్ ప్రసాదరావు మాట్లాడుతుండగా, టిడిపి సభ్యుడు అడ్డుపడ్డారు. భూములు కోల్పోయి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అధికారులు రెండు సెంట్ల స్థలాలతో పాటు రాచపల్లి భూములు ఆన్లైన్ చేయలేదని వాగ్వాదానికి దిగారు. దీంతో ఎంపీపీ. సత్యనారాయణ కలుగజేసుకొని ముఖ్యమంత్రి పర్యటన నాటికి నిర్వాసితులకు రెండు సెంట్ల స్థలాలు మంజూరు చేస్తామని అనహర్హులను తొలగిస్తామని చెప్పడంతో టిడిపి సభ్యులు ఒకేసారి గొడవలకు దిగారు. అనర్హుల జాబితా అనేది ఇప్పుడు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. దీంతో కొంత సేపు వాగ్వాధాలు జరిగాయి. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం రెండు సెంట్లు ఇచ్చే భూమి పై ఐదు కేసులు హైకోర్టులో పరిధిలో ఉన్నాయన్నారు. భూ సర్వే జరుగుతున్న పరిస్థితుల్లో రైతుల్లో ఆందోళన కలిగిస్తుందని, దీనిపై రైతులకు స్పష్టమైన సూచనలు తెలపాలని శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు తెలిపారు. రీ సర్వే పై ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తహశీల్దార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీ రాజారావు, సత్యవతి, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ :స్థానిక వెలుగు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి బుధవారం ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు చేతుల మీదుగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేలురకం ధాన్యం 17శాతం, ఆర్‌జెఎల్ 100కేజీలకు రూ.2వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు తమ పంటను ఈ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండటం కోసం సహకార సంఘాలు, వెలుగు ద్వారా ధాన్య సేకరణ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎంతగానో సేవ చేయాలని ధాన్యాన్ని సేకరించి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, చీడిగుమ్మల పిఎసిఎస్ అధ్యక్షులు రామకృష్ణ, వెలుగు ఏపీఎం మంగ, ఏఒ సంధ్య పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో హెడ్ కానిస్టేబుల్ ప్రతిభ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస పట్టణంలో జరిగిన స్టేట్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ -2022 పోటీలలో నర్సీపట్నం సబ్ డివిజన్‌కు చెందిన క్లూస్ టీం ఇన్చార్జ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగవ స్థానం దక్కింది. ఈ సందర్భంగా సబ్ డివిజన్ అధికారులు డిఎస్పి కె.ప్రవీణ్ కుమార్, నర్సీపట్నం రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పనిచేస్తూ బాడీ బిల్డింగ్‌లో ఎన్నో అవార్డులు సాధించి డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకొచ్చిన శ్రీనివాసరావును అభినందించారు.

ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-గొలుగొండ:ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గొలుగొండ బ్లాక్ యూనిట్ ఎన్నికలు బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి వై.రామకృష్ణ తెలిపారు. ఈ ఎన్నికలలో తాలుకా యూనిట్ ప్రెసిడెంట్‌గా బివి.సత్యనారాయణ(ఏవో గొలుగొండ), సెక్రటరీగా ఆర్‌విఆర్‌కే.రవికుమార్(జెడ్పీహైస్కూల్ కేడిపేట), వైస్ ప్రెసిడెంట్‌గా వి.జగదీష్(సీనియర్ అసిస్టెంట్, గొలుగొండ), జాయింట్ సెక్రటరీగా పిఎన్‌విఎస్ నాయుడు (జడ్పీ హైస్కూల్, జోగంపేట), ట్రెజరర్‌గా పి.అనితశ్రీ(టైపిస్టు గొలుగొండ), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఆర్‌వి.రాజు(రికార్డు అసిస్టెంట్, జడ్పి హైస్కూల్ జోగంపేట), జిల్లా కౌన్సిల్ సభ్యులు-2 జి.ఎస్‌వి.కృష్ణంరాజు (జూనియర్ అసిస్టెంట్, గొలుగొండ), ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు అభినందనలు తెలిపారు.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ఉక్కును అమ్మేవాడికి, కొనేవాడికి బుద్ధిచెబుతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
విశాఖ ఉక్కును అమ్మేవాడికి, కొనేవాడికి.. ఇద్దరికీ బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 671వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, మంగ వెంకటరావు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్, చంద్రశేఖర్ మాట్లాడారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కని, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమలు పెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అంబానీ, అదానీలను ఆహ్వానిస్తే స్వాగతిస్తాంగానీ విశాఖ ఉక్కు వంటి భారీ పరిశ్రమను కారుచౌకగా బడా వ్యాపారవేత్తలకు అప్పగించాలని చూస్తే మాత్రం సహించబోమన్నారు. రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. సొంత గనులు లేకపోయినా లాభాల్లో నడిచిన ఏకైక పరిశ్రమ విశాఖ ఉక్కునేనని తెలుసుకోవాలన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మేస్తే హిందుస్థాన్ జింక్, ఎయిర్ ఇండియా పరిస్థితే పునరావృతం అవుతుందన్నారు. కృత్రిమ బొగ్గు కొరత సృష్టించి జనవరిలో నిలిపివేసిన బిఎఫ్ - 3లో ఉత్పత్తిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో నాయకులు సీతారామరాజు, త్రినాథ్, చౌదరి, ఎన్ఆర్‌సి.మూర్తి, డి.సత్యనారాయణ, ఎల్‌వి.రమణ పాల్గొన్నారు.

చంద్రబాబుపై విమర్శలు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి అధినేత చంద్రబాబుపై వైసిపి నేతల విమర్శలు తగవని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించడం ముఖ్యమని, పార్టీ కొత్త కార్యాలయ భవనానికి భూమి పూజ చేయడం గొప్ప కాదని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎండాడ సమీపంలోని పనోరమ హిల్స్ సమీపంలో వైసిపి నూతన కార్యాలయానికి భూమి పూజ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో 175 స్థానాలకు 175 స్థానాలలో గెలుపు సాధించాలని జగన్మోహన్ రెడ్డి పగటి కలలు కంటున్నారని, అది ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని అన్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు అన్ని తరగతుల వారినీ మోసం చేసినందుకా 175 స్థానాలు ఆశిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

విజయసాయిరెడ్డికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పబ్లిక్ అకౌంట్ కమిటీ (పిఎసి) సభ్యునిగా వైసిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి ఎన్నికవడం పట్ల విశాఖకు చెందిన పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ సహా పలువురు అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

వైసిపి నేతల వ్యాఖ్యలపై జనసేన నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి వాహనాన్ని చూసి వైసిపి నేతలు వణుకుతున్నారని జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. వారాహి వాహనంపై వైసిపి నేతల వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన వీర మహిళల విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వారాహి' సప్త మాతృకల్లో అమ్మవారి పేరని తెలిపారు. 1982లో ఎన్‌టిఆర్, 1999లో ఎల్‌కె.అద్వానీ రథయాత్రలు చేసి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. వారాహి రథయాత్ర ద్వారా పవన్ ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు.

వైరస్ దాడులపై అప్రమత్తత అవసరం

ఫోర్త్ వేవ్ కోవిడ్ వచ్చినా ఆందోళన చెందనక్కర్లేదు
సమాజంలో సైన్స్ పాత్రపై చర్చ జరగాలి
ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షురాలు ప్రొఫెసర్ చంద్రిమ షాహా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
వైరస్‌ల దాడుల పట్ల శాస్త్రవేత్తలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) అధ్యక్షురాలు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ చంద్రిమ షాహా అన్నారు. సమాజంలో సైన్స్ పాత్రపై చర్చ జరగాల్సి ఉందని తెలిపారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ 88వ వార్షిక సాధారణ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె సదస్సును ప్రారంభించి మాట్లాడారు. వైరస్ దాడులపై దేశంలోని యువ, వృద్ధ శాస్త్రవేత్తల్లో సమిష్టి ఆలోచనాతత్వం, అప్రమత్తత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. ప్రపంచంపై కోవిడ్-19 వైరస్ దాడి చేసి ఎంతగా కీడు చేసిందో తెలిపారు. ఫోర్త్ వేవ్ కోవిడ్ వచ్చినా పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని ఆమె తెలిపారు. వ్యాధుల సవాళ్లను ఎదుర్కొనడంలో సైన్స్‌లో చాలా మార్పులు వచ్చాయన్నారు. టెలిమెడిసిన్, డిజిటల్ మెడిసిన్ దేశంలో అభివృద్ధి అయిందన్నారు. సైన్స్ రంగంలో వస్తున్న మార్పులపై సమాజంలో చర్చ జరిగేలా, ప్రజాభిప్రాయం కూడగట్టేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఇన్‌ఫెక్షన్స్ చారిత్రక క్రమాన్ని వెల్లడించారు. వ్యవసాయ మొక్కల నుంచి వైరస్‌లు జంతువులకు, ఆ తరువాత మనుషులకు చేరాయన్నారు. స్మాల్ ఫాక్స్, ప్లేగు, ఇతర ఫ్లూలు సమాజంలోకి జొరబడ్డాయన్నారు. రష్యన్ ఫ్లూ, స్పానిష్ ఫ్లూ, కనస హెచ్1ఎన్1, కోవిడ్-19 ఇవన్నీ సమాజంపై దీర్ఘకాలం ప్రభావం చూపనున్నాయని తెలిపారు. స్మాల్ ఫాక్స్‌పై పరిశోధన, అధ్యయనం ఇంకా పెరగాల్సి ఉందన్నారు. జన్యుపరంగా కొన్ని వ్యాధులు నాటి నుంచి నేటికీ దర్శనమిస్తున్నాయని వివరించారు. వ్యాధుల విషయంలో కొంతమేర భద్రత ఉన్నట్టేనని తెలిపారు.

ఇన్సా ఉపాధ్యక్షులు, ఐఐటి ముంబయి మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ డివి.ఖాఖర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16 వరకూ మూడు రోజులపాటు విశాఖలో జరుగనున్న ఈ వార్షిక సమావేశాలకు దేశ నలుమూలల నుంచీ 200 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారన్నారు. తొలుత ప్రతినిధులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ (సిఎస్ఐఆర్-గోవా) డైరక్టర్ ప్రొఫెసర్ సునీల్ కె సింగ్ సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నానికి చెందిన డాక్టర్ జిపిఎస్.మూర్తి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రిమ షాహా

అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చండి

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌కు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల ఓటర్ల జాబితాలో అర్హులందరినీ ఓటర్లుగా చేర్చి ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లనందరినీ అదే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా నూతన జాబితా ప్రకటించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కోరారు. బుధవారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో వందలాది మంది అర్హుల పేర్లులేవన్నారు. ప్రధానంగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకున్న అర్హుల పేర్లు జాబితాలో కనిపించలేదన్నారు. అందులో కొన్ని తహశీల్దారు కార్యాలయాల్లో ఈ దరఖాస్తులను కంప్యూటర్‌లో ఎక్కించడానికి సమయం చాలక పక్కన పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, అర్హులందరినీ ఓటర్లుగా జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల ప్రకటించిన ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అనర్హుల పేర్లున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు చేసిన విషయాన్ని కలెక్టర్‌కు గుర్తు చేశారు. దీనిపై అధికారులు, సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నట్లు పత్రికల్లో వార్తలు రావడం ముదావహమన్నారు. అర్హులు ఒక్కరు కూడా ఓటుకు దూరం కాకుండా, అనర్హులకు జాబితాలో చోటు లేకుండా చేయాలని మరోమారు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మధ్య పోలింగ్ స్టేషన్లవారీ ఓటర్ల జాబితాను ప్రకటించగా ఇవి బిఎల్ఒలకు, ఓటర్లుకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవిగా ఉన్నాయన్నారు.

జివిఎంసి 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల్లోని ఓటర్లకు పిఎస్ నెంబరు 273 (58వ వార్డు), పిఎస్ నెంబరు 274 (40వ వార్డు), పిఎస్ నెంబరు 275 (61వ వార్డు) జివిఎంసి ప్రైమరీ పాఠశాలల్లో ఏర్పాటు చేశారన్నారు. ఈ మూడు పోలింగ్ స్టేషన్లలో ఏడు వార్డుల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇది బిఎల్ఒల పనికి, ఓటర్లకు ఇబ్బంది అవుతోందని, ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదముందని అన్నారు. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ నేపథ్యంలో వెంటనే కలుగజేసుకుని ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లను అదే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా నూతన జాబితాలు ప్రకటించాలని కోరారు.

వైసిపి నేతల కన్నుపడిన స్థలమిదే..

ప్రభుత్వ స్థలంపై వైసిపి కన్ను

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్
అసలే అనకాపల్లి జిల్లా కేంద్రానికి దగ్గరిలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలం... రాష్ట్రంలోనే అభివృద్ధికి అద్దం లాంటి విశాఖకు కూతవేటు దూరం.. నాలుగెకరాల స్క్వేర్ బిట్టు.. చేతిలో అధికారం... ఇంకేముంది మాకెవ్వరు అడ్డు అన్నట్లు కోట్ల రూపాయలు విలువైన జాగాపై అధికార వైసిపి కన్ను వేసింది. వైసిపి జిల్లా కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని అధికారులపై ఒత్తిడి తేగా, అందుకు డూడూ బసవన్నలా రెవెన్యూ అధికారులు తలూపినట్లు తెలిసింది. అయితే ఈ స్థలాన్ని గ్రామ అవసరాల కోసం ఉంచుకోగా, దీనిని వైసిపి కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు తెలుసుకున్న స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా, జివిఎంసి పరిధిలో ఉన్న రాజుపాలెం రెవెన్యూ, కొత్తూరు నరసింగరావుపేట సర్వే నెంబర్ 75/1, 75/3, 75/4లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ గ్రామం జివిఎంసిలో విలీనం కాక ముందు రాజుపాలెం పంచాయితీలో ఉండేది. అప్పట్లో చాలా మంది ఈ స్థలంలో పునాదులు వేసి ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నం చేశారు. అప్పటి పంచాయితీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ చొరవతో గ్రామస్తులనందరినీ ఒప్పించి అందులో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగింపజేశారు. ఈ నాలుగెకరాల స్థలంలో గ్రామస్తులందరికీ ఉపయోగపడే కల్యాణ మండపం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యాయామ నడకదారి, గ్రంథాలయం, అప్పర్ ప్రైమరీ స్కూల్ వంటి నిర్మాణం కోసం ఉపయోగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జివిఎంసిలో విలీనమైన తరువాత గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించే ప్రయత్నం చేయగా, ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. దీంతో నాడు కాపు కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ స్థలంలో కల్యాణమండపం నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఈలోగా వచ్చిన ఎన్నికల్లో ఈ స్థలంలో క్రీడా మైదానం, కల్యాణ మండలం నిర్మిస్తామని నేటి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. గెలిచారు, మంత్రి కూడా అయ్యారు. కానీ నాడు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. పైగా గ్రామస్తులు సెంటుమెంటుగా పెట్టుకున్న ఈ స్థలాన్ని వైసిపి కార్యాలయానికి కేటాయించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తేవడం, ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుసుకున్న స్థానికులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు సరికదా, గ్రామస్తులు ఎన్నో ఆశలతో ఏళ్ల తరబడి కాపాడుకుంటూ వస్తున్న భూమిని కాజేయాలని చూస్తున్న నాయకులు ఊర్లోకి ఎప్పుడు వస్తారా ? అని గ్రామస్తులంతా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ పెద్దలు తమ ప్రయత్నాలుమాని, ఎన్నికల హామీ మేరకు క్రీడా మైదానం, కల్యాణ మండపం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

4న విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిన 4న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగనుందని చెప్పారు. తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సినిమా రంగంలో 24 విభాగాలకు చెందినవారు సినిమాలు, వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్‌లను ఈ నెల 28లోపు తమకు పంపాలన్నారు. ఫెస్టివల్ కమిటీ పర్యవేక్షణలో ఎంపిక చేసిన వారికి ప్రముఖుల ద్వారా అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఫౌండర్ పులగం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు